జయ హనుమాన జ్ఞానగుణసాగర

పెనమలూరు:మండల పరిధిలో హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తులు ఆదివారం ఘనంగా చేశారు. యనమలకుదురు గ్రామంలో కొండ పై వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయ ప్రాగణంలో 50 అడుగుల ఎత్తులో ఉన్న దాసాంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారిని మేళతాళాలతో మేలుకొలిపి పంచామృతాభిషేకం, అలంకరణ చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శత 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్, కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధర్‌రావు పాల్గొన్నారు. పెద పులిపాక విజయరాజరాజేశ్వరి ఆలయంలో వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి చేశారు. హనుమాన్‌చాలీసా, సూక్త హోమం, ప్రత్యేక పూజలు చేశారు. పోరంకి శ్రీ హనుమాన్ దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్‌చాలీసా చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

• రామవరప్పాడు: రూరల్ మండలం ఎనికేపాడు, రామవరప్పాడు, నున్న గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎనికేపాడులోని జెండా చెట్టు సెంటర్ సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణను కమిటీ సభ్యులు సత్కరించారు. మధ్యాహ్నం సుమారు నాలుగు వేల మందికి అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాదు బోసుబాబు, ఉపసర్పంచ్ టంకసాల శివ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు రాచమళ్ల ర త్నకుమారి, కొండేటి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

• రామవరప్పాడు చిన్నవంతెన సెంటర్‌లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు పాల్గొని ఆలయ అభివృద్ధికి సొంత నిధుల నుంచి రూ.15 వేల విరాళాన్ని అందజేశారు

• నున్నలోని యోగేశ్వర్ దేవి దయాళ్ మహామందిర్‌లో పంచముఖ హనుమాన్‌కు పంచామృతాభిషేకం, హారతి, 108 సార్లు హనుమాన్ చాలీసా చేశారు. అమితి దేవ్‌జీ ఆధ్వర్యంలో మహా ప్రభుజీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

• గన్నవరం: స్థానికంగా హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హిందు చైతన్య వేదిక ఆధ్వర్యాన హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. తొలుత ఈ యాత్రను స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో శ్రీభువనేశ్వరీ పీఠాధిపతి కమలానందభారతీస్వామి ప్రారంభించారు. చైతన్య వేదిక నిర్వాహకులు శేషుకుమార్, పర్వారం విష్ణుమూర్తి, వెలుగంటి శివాజీ, చిమట రవివర్మ, యామర్తి అరవింద్, దిలీప్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 16 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామికి 50 వేల తమలపాకులతో అర్చన చేశారు. మరో 50 వేల గారెల మాలతో స్వామివారిని అలంకరించారు. అర్చకులు ఎస్. రామాచార్యులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు, అన్నసమారాధాన చేశారు.

• కంకిపాడు: హనుమజ్జయంతి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జాము నుంచే రామాలయాలు, ఆంజనేయ స్వామి దేవస్థానాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సింధూరం, తమలపాకులతో పూజలు చేశారు. కంకిపాడు పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మద్దూరు గ్రామం నుంచి శోభాయాత్ర చేపట్టారు. ఈ యాత్ర మద్దూరు నుంచి కంకిపాడు, పెనమలూరు మీదుగా సాగింది. విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ప్రకండ వల్లభుని లోకేష్ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు, నాయకులు అరవింద్, లంకే రాజ్ కమల్, గ్రామ సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, చిప్పల బుల్లిబసవయ్య, పి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

• గన్నవరం రూరల్: సూరంపల్లి శ్రీ సంజీవని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. పురుషోత్తపట్నం, తెంపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో హనుమత్ జయంతి సందర్భంగా మహా కుంభాభిషేక మహోత్సవాలు జరిగాయి.

హనుమాన్‌జంక్షన్ రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యాన జంక్షన్ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి మేళతాళాలు, హనుమాన్ భజనలతో ఐటీఐ రోడ్డులోని సాయిబాబా ఆలయం వరకు శోభయాత్ర జరిగింది. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బొకినాల సాంబశివరావు, మహిళా విభాగం (మాతృశక్తి) జిల్లా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రచారక్ యడ్లపల్లి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి



యనమలకుదురు ఆలయంలో హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



యనమలకుదురులో ప్రత్యేక పూజలు



కంకిపాడులో పూజలు చేస్తున్న భక్తులు



దావాజిగూడెంలో శ్రీఅభయాంజనేయస్వామి



గన్నవరంలో శోభయాత్ర ప్రారంభిస్తున్న భారతీస్వామి



మద్దూరు నుంచి చేపట్టిన శోభాయాత్ర

జంక్షన్‌లో ఘనంగా హనుమజ్జయంతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆంజనేయ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ ప్రధానార్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం రామాచార్యులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, ఏపీ సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, నూజివీడు స్పెషల్ కోర్టు జడ్జి వేల్పుల కృష్ణమూర్తి అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

25 వేల మందికి మహా అన్నప్రసాద వితరణ

జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 25 వేల మందికి భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక వేలేరు ముఖద్వారం వద్ద వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వర, పంచముఖ అంజనేయ సమేత సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి కనుమూరి సూర్యనారాయణరాజు (చిన్నరాజు) నేతృత్వంలో లారీ ఓనర్స్, వర్కర్స్ కుల మతాలకు అతీతంగా చేతులు కలిపి భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేయటం విశేషం. ఆర్డీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు (రాజాబాబు), ఆయన సోదరుడు కనుమూరి భాస్కరరాజు, పలువురు లారీ ఓనర్స్ అన్నదాన ఏర్పాట్లును పర్యవేక్షించారు. జాతీయ రహదారి వద్ద దాదాపు 20 అడుగుల ఎత్తైన పీఠం నిర్మించి, దానిపై 36 అడుగల అభయాంజనేయ స్వామి విగ్రహం నిర్మించనున్నట్లు సుబ్బరాజు తెలిపారు.

రూ.25 వేలు పలికిన లడ్డూ ప్రసాదం..

హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంజనీపుత్రుడి సన్నిధిలో విశేషపూజలు అందుకున్న లడ్డూ ప్రసాదాలను దేవదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డు గణపతి కాంప్లెక్స్‌లోని వీరాంజనేయ సూపర్ మార్కెట్ నిర్వాహకులు 25 కేజీల లడ్డూ ప్రసాదాన్ని రూ. 25 వేలకు వేలంపాటలో సొంతం చేసుకున్నారు. మరో 18 కేజీల లడ్డూ ప్రసాదాన్ని కూరగాయల వ్యాపారి గుత్తా శ్రీనివాసరావు రూ. 23,116లకు వేలం పాటలో దక్కించుకున్నారు.

దేవస్థానాల్లో విశేషంగా పూజలు



ఉయ్యూరు హనుమాన్ నగర్‌లో ఆంజనేయుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: హనుమజ్జయంతి వేడుకలు అంతటా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ నగర్, బస్టాండ్ సెంటరు, ఫ్లోరా వంతెన సెంటర్లలోని ఆంజనేయ స్వామి దేవస్థానాల్లో ఆదివారం వేకువజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తరించారు. హనుమాన్ చాలీసా పఠించి భక్తిపారవశ్యం చెందారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి స్వామి వారికి పూజలు చేయించారు. ఆయా ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన అన్నసంతర్పణను ఎమ్మెల్యే ప్రారంభించారు.

వైభవంగా శోభాయాత్ర...

ఉయ్యూరులో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. సువర్చల ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు పూజాకార్యక్రమాలు నిర్వహించి శోభాయాత్ర చేపట్టారు. యాత్రను పరుచూరి శ్రీనివాసరావు, గబ్బిట దుర్గాప్రసాద్, కుటుంబరాజు ప్రారంభించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పట్టణం అంతటా శోభాయాత్ర నిర్వహించారు. యాత్రకు అన్ని ప్రాంతాల్లోనూ భక్తులు హారతులు పట్టి స్వాగతం పలికారు. శోభాయాత్రను హరీష్, రాజేష్ పర్యవేక్షించారు.

గొట్టుముక్కల వంశస్తుల ఆత్మీయ కలయిక



గన్నవరం రూరల్: సమాజ సేవకు పునరంకితమవుదామని గొట్టుముక్కల వంశస్తులు ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని గోపవరపుగూడెంలో 50 ఏళ్ల తర్వాత ఆ గ్రామానికి చెందిన గొట్టుముక్కల నర్సయ్య వంశస్తులు ఒక్క చోట ఆత్మీయంగా కలిశారు. ఒడిశా, కర్ణాటక, తెలంగాణ, ఏపీ తదితర రాష్ట్రాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడిన ఈ గ్రామానికి చెందిన వారందరూ 500 మంది కలసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పెద్దలు చెమర్చిన కళ్లతో పిన్నలను ఆశీర్వదించారు. ఇదే రోజు పుట్టినరోజులు, పెళ్లిరోజులు జరుపుకున్న వారిని వేదికపై సత్కరించారు. చిన్నారులు డ్యాన్స్‌లు చేశారు. మహిళలు భక్తి గీతాలు పాడారు. ఆడబిడ్డలకు పసుపు కుంకుమలు అందజేసి సంప్రదాయాన్ని చాటారు. తరచూ ఈ ఆత్మీయ కలయికను కొనసాగించాలని పెద్దలు సూచించారు. ఆత్మీయ కలయిక నిర్వాహకులను సత్కరించారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు చేయూత

కంకిపాడు: వైఎస్సార్ జలకళతో రైతులకు చేయూత అందుతుందని తెన్నేరు సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో వైఎస్సార్ జలకళ కింద బోరు పనులకు ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్ ఎలీషా మాట్లాడుతూ తొలి దశలో గ్రామానికి మూడు బోర్లు మంజూరయ్యాయన్నారు. అర్హత గల రైతుల పంట పొలాల్లో బోరు ఏర్పాటు పనులు సాగుతున్నాయన్నారు. రూ.5.49 లక్షలు ఇందుకు కేటాయించారన్నారు. జలకళ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మట్టా నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ వీరంకి నరేష్, రైతులు పాల్గొన్నారు.



బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా, రైతులు, స్థానిక నేతలు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో 1984-85 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 38 సంవత్సరాల తరువాత ఒకచోట సమావేశమై ఆనందంగా గడిపారు. తాము విద్యనభ్యసించిన తరగతి గదులను కలియతిరిగి ఆ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, ఆటపట్టింపులతో ఆనందోత్సాహాల నడుమ సందడి చేశారు. పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ప్రతినిధులు మురపాల మురళీకృష్ణ, దీవి రామకృష్ణ, పుట్టగుంట రఘు, ఒత్తుమిల్లి కృష్ణమోహన్, పర్వతనేని దుర్గాభవాని, అనుమోలు నాగమణి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఉయ్యూరు: మండలంలోని కాటూరు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ సీహెచ్ రాంబొట్లు తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటుతో సబ్‌స్టేషన్ పరిధిలోని కాటూరు, రాజుపేట, కడవకొల్లు, పొట్లపాడు, వీరవల్లి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదకవిత.. సామాజిక చైతన్య గీతిక

విజయవాడకల్చరల్: పదకవిత సామాజిక చైతన్యగీతిక అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు 615వ జయంతి అన్నమయ్య స్వరార్చన, అంతర్జాతీయ మాతృదినోత్సవం, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక నిర్వాహకుడు నూకవరపు ప్రసాదరావు ద్వితీయ వర్థంతి సభను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల్లో అద్భుతమైన తెలుగు పదాలు కనిపిస్తాయని నేడు కొన్ని కనుమరుగైపోయాయన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ శేషుకుమార్ మాట్లాడారు.

40 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



కంకిపాడు: మండలంలోని కందలంపాడు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంకిపాడుకు చెందిన లైఫ్‌కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు ప్రారంభించారు. షుగరు, బీపీ, కీళ్ల వ్యాధులు, గుండె సంబంధ వ్యాధులకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 40 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులు మెరుగైన వైద్యం అందించటం అభినందనీయమన్నారు.

క్లుప్తంగా

పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

ఉంగుటూరు: అర్హత ఉండి ఇంకా పింఛన్ పొందని వారు ఉంటే ఈ నెల 16వ తేదీలోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకుని అర్హత ఉన్న లబ్ధిదారులకు వచ్చే నెలలో మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు



కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం నిర్వహించారు. చెస్, క్యారమ్స్‌పై శిక్షణ అందించారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి సిహెచ్ రామకృష్ణ, శిక్షకులు శ్రీకాంత్, పి.సురేష్‌బాబు, రాంబాబు, శివపార్వతి పాల్గొన్నారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పాటలు, నృత్త పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

యనమలకుదురులో మజ్జిగ పంపిణీ



పెనమలూరు:మదర్స్ డే సందర్భంగా యనమలకుదురులో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నేత, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు నిర్వహించి అనంతరం జగనన్న చలువ పందిరి వద్ద ప్రయాణికులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబూరావు, నాగేశ్వరరావు, నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

పోరంకిలో చైన్ స్నాచింగ్

పెనమలూరు: పోరంకి గ్రామంలో చైన్ స్నాచింగ్ జరగటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకరం... పోరంకి జాబిల్లి ఆస్పత్రి ప్రాంతానికి చెందిన వి.కస్తూరి శనివారం అయ్యప్పనగర్‌కు వెళ్లి తిరిగి సాయంత్రం బయలుదేరి పోరంకి సెంటర్‌లో బస్ దిగింది. ఆమె నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి కనబడి రామాలయం ఎక్కడ అని అడిగాడు. ఆమె సమాధానం చెప్పేలోపే మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుని పరుగెత్తి కొద్ది దూరంలో ఉంచిన బైక్‌తో పారిపోయాడు. స్థానికులు గాలించగా ఆచూకీ తెలియలేదు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

బ్యాంకు ఖాతాలో సొమ్ము స్వాహా

పెనమలూరు: పోరంకికి చెందిన వ్యక్తి బ్యాంకు ఖాతాలో ఆయనకు తెలియకుండా గుర్తు తెలియని వ్యక్తులు సొమ్ము విత్ డ్రా చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోరంకి ప్రాంతానికి చెందిన ఎం.ధర్మేంద్ర ఫార్మా కంపెనీలో ఏరియా మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు యాక్సిస్, ఎస్‌బీఐ బ్యాంకుల క్రెడిట్ కార్డులు ఉన్నాయి. అయితే గత మార్చి 13వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు గుర్తు తెలియని వ్యక్తులు అతని బ్యాంకు ఖాతాలో నుంచి రూ.80,534 సొమ్ము విత్ డ్రా చేశారు. సొమ్ము డ్రా జరిగిన సమయంలో మెసేజ్‌కాని, ఓటీపీ కాని రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాను ఎటువంటి లింక్‌లు కూడా క్లిక్ చేయలేదని తెలిపాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

మనోవికాసానికి ఆటల పోటీలు దోహదం

గన్నవరం రూరల్: ఆటపాటలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని పురుషోత్తపట్నం గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. ఆదివారం ప్రభుత్వం అమలు చేస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి సంగీత నృత్యనికేతన్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన సాగింది. 14 మంది నృత్యకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



పెనమలూరు:క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఒమేగా ఆస్పత్రి వైద్యురాలు గీతికా అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో ఆదివారం మదర్స్ డే సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రీ ఉమెన్ హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించి 102 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భగా డాక్టర్ గీతిక మాట్లాడుతూ ఆహారపు అలవాట్లతో పాటు, కుటుంబ నేపథ్యం కారణంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. రూట్స్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యకరంగా ఉంటేనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. వివిధ రకాల క్యాన్సర్ పరీక్షలకు రూ.8 వేలు ఖర్చు అవుతుందని తాము ఉచితంగా పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. వైద్యులు పద్మజ, రైబా, రూట్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రపంచ మాతృదినోత్సవం నిర్వహించారు. పలువురు తల్లులకు వారి పిల్లలు కాళ్లు కడిగి పాదాభివందనం చేశారు. అనంతరం ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి. సీతారాం మాట్లాడుతూ.. విద్యార్థులు జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలని చెప్పారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, వీసం ప్రసాదరావు, వాకింగ్ ట్రాక్ ఇన్‌ఛార్జ్ మున్వర్ అహ్మద్, ఉపాధ్యాయులు రవిబాబు, సూరగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: తన కుమారుడు కనిపించటం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన జంపాన రమేష్ కొడుకు యోగ సాయి నాథ్ (20) ఇంటర్ వరకూ చదువుకుని ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఖాళీగా ఉండొద్దని, పని చేసుకోమని తండ్రి మందలించాడు. దీంతో ఈ నెల 12న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. చుట్టుపక్కల విచారించినా ప్రయోజనం లేకపోవటంతో తండ్రి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.